
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 18.0

ANDHRAJYOTHY 5



జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

గురువారం 28 నవంబరు 2024

'పాడి' దిద్దిన కాపురం

- వ్యవసాయం కలిసి రాక నష్టాల పాలైన కుటుంబం
- ఉపాధి కోసం గేదెల పెంపకం చేపట్టిన భీముడు



7

అమ్మకానికి.. బోనఫైడ్

- విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలలు
- ఉద్యోగాల కోసం లోకల్ అభ్యర్థిగా ఉండేందుకు కొంటున్న నిరుద్యోగులు
- ఉన్నత చదువుల కోసం విద్యార్థులు..
- ఏటా రూ.లక్షల్లో వ్యాపారం
- ప్రతీ స్కూల్లో నిబంధనలకు విరుద్ధంగా రెండో అడ్మిషన్ రికార్డు నిర్వహణ
- నష్టపోతున్న నిజమైన అభ్యర్థులు
- నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా పట్టించుకోని విద్యాశాఖ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు బోనఫైడ్‌లు అమ్ముకుంటూ ఏటా లక్షలు గడిస్తున్నాయి. కొన్ని మూత పడ్డ పాఠశాలలతో పాటు, ప్రస్తుతం కొనసాగుతున్న స్కూల్స్ కూడా ఈ దందాకు తెరలేపాయి. ఉద్యోగాలు వచ్చిన అభ్యర్థులు, పై చదువుల కోసం విద్యార్థులకు లోకల్ కోసం ఈ బోనఫైడ్‌లు అవసరం అవుతాయి. స్థానికంగా కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో చదివిన వారు ఆయా అవసరాల కోసం డబ్బులిచ్చి, వాటిని కొనుక్కుంటున్నారు. ఈ క్రమంలో ఆయా స్కూల్స్‌లో చదివిన నిజమైన అభ్యర్థులు ఈ మాయాజాలం వల్ల రికార్డుల్లోని అడ్మిషన్ నంబర్లు సరిపోక నష్టానికి గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ స్కూళ్లను తనిఖీలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.



మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయం



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 27: పాఠాలు చెబుతామని విద్యాశాఖ నుంచి అనుమతి తీసుకున్న పలు ప్రైవేట్ పాఠశాలలు అక్రమాలకు పాల్పడుతున్నాయి. డబ్బులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా బోనఫైడ్‌లు అమ్ముతున్నాయి. తద్వారా విద్యార్థుల నుంచి వచ్చే ఫీజుల కంటే అధికంగా రూ.లక్షల్లో డబ్బులు సంపాదిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారికంగా ఒకటి, ప్రైవేటుగా ఒకటి అడ్మిషన్ రికార్డులను నిర్వహిస్తూ ఈ తతంగానికి పాల్పడుతున్నారు. ఈ మాయాజాలంతో కొందరు సదరు పాఠశాలలో చదివినా,

(మిగతా 7లో..)

మచ్చుకు కొన్ని ఉదాహరణలు..

- ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక పాఠశాల 1985-1989 వరకు ఒకటో తరగతి నుంచి నాలుగో తరగతి వరకు చదివినట్లు ఒక అభ్యర్థికి బోనఫైడ్ సర్టిఫికెట్ జారీ చేసింది. సదరు విద్యార్థి తండ్రి చనిపోవడంతో కారుణ్య నియామకం కింద అతనికి ఉద్యోగం వచ్చింది. అందుకోసం అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చారు. రికార్డులో ఉన్న పాఠశాల ఇప్పుడు మూత పడింది. దాంతో అందుకు సంబంధించిన రికార్డులను మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పరిశీలించగా.. ఆ రికార్డులో ఆ బోనఫైడ్ ఉన్న అడ్మిషన్ స్థానంలో మరొకరి పేరు ఉంది. దాంతో అది నకిలీదని తేల్చారు. ఆ అభ్యర్థి ఆ స్కూల్‌లో చదివినా స్కూల్ యాజమాన్యం కక్కుర్తి వల్ల నష్టపోయాడు. ఇదెలా జరిగిందంటే.. చాలా ప్రైవేట్ పాఠశాలలు రెండు అడ్మిషన్ రిజిష్టర్లను మెయింటైన్ చేస్తున్నాయి. పాఠశాల మూతపడితే ఒక రిజిష్టర్‌ను విద్యాశాఖకు అప్పగించి, మరో రిజిష్టర్ వారి వద్దే ఉంచుకుంటున్నారు. వారి వద్ద ఉంచుకున్న రిజిష్టర్‌లోంచి బోనఫైడ్‌లను డబ్బులు తీసుకుని, ఇతరులకు అమ్ముకుంటున్నారు. పాఠశాలలు కొనసాగుతున్నవి అయితే బోనఫైడ్ రిజిష్టర్‌లో మధ్యలో కొన్ని అడ్మిషన్ నంబర్లు వేయకుండా వదిలేసి, మిగతావి ఇస్తున్నారు. అలా వదిలేసినవి డబ్బులకు ఇతరులకు అమ్ముకుంటున్నారు. కారుణ్య పద్ధతిలో ఉద్యోగం వచ్చిన అభ్యర్థి విషయంలో అదే జరిగింది. మొదట్లో అతనికి ఇచ్చిన బోనఫైడ్ విద్యా శాఖకు అప్పగించిన రిజిష్టర్‌లోంచి కాకుండా, సెకండరీ రిజిష్టర్‌లోంచి ఇచ్చారు. విద్యాశాఖకు అప్పగించిన రిజిష్టర్‌లో ఆ బోనఫైడ్ వివరాలు లేవు. దాంతో అభ్యర్థి అదే స్కూల్‌లో చదివినా నష్టపోయాడు.
- ఇటీవల జరిగిన డీఎస్సీ కౌన్సెలింగ్‌లో కూడా పాలమూరు జిల్లాలో చదినట్లు ఒకరు బోనఫైడ్‌లు చూపించారు. సదరు పాఠశాల రికార్డులను తనిఖీ చేస్తే అక్కడ ఆ అభ్యర్థి పేరు లేకపోవడంతో వచ్చిన ఉద్యోగం పోయింది.

సంబురంగా స్వర్ణోత్సవాలు

- బాల్య స్మృతులను నెమరు వేసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాణీ ఇందిర దేవి (ఆర్ఐడీ) పాఠశాల, కళాశాల స్వర్ణోత్సవాలు బుధవారం మధ్యాహ్నం ప్రారంభమయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఆర్ఐడీ పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో సురభి రాజుల కోటలో మొదలైన వేడుకలు అంబరాన్నంటాయి. స్వర్ణోత్సవాలకు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మై హోమ్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు దంపతులు, ఢిల్లీ బిట్స్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ (మిగతా 6 లో..)



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి, మై హోమ్ రామేశ్వరరావు

ఆడపిల్లలపై చిన్నచూపు వద్దు

వనపర్తిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలపై చిన్న చూపు వద్దని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. వనపర్తి పట్టణంలోని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ కార్యక్రమాన్ని ఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో ఎదుగుతున్నారని, ఆడపిల్ల అనగానే చిన్న చూపు చూడకుండా తల్లిదండ్రులు స్వేచ్ఛ ఇవ్వాలని, అప్పుడే వారు అన్ని రంగాల్లో దూసుకెళ్తారని తెలిపారు. ఆపద వస్తే ఏవిధంగా అధిగమించాలనే అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. కుటుంబ ఆర్థిక భారాన్ని నేడు స్త్రీశక్తి లాగుతోందని తెలిపారు. విద్యార్థినులు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో యాదయ్య, జిల్లా మెడికల్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డీపీవో సురేష్ కుమార్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాంబాబు, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్ చెన్నమ్మథామస్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

చదువు ఇక్కడ.. అడ్మిషన్ అక్కడ

- ఆందోళనలో విద్యార్థులు
- ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు
- అడ్మిషన్ ఒక చోట బోధన మరోచోట

వనపర్తి జిల్లాలో ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థుల పరిస్థితి చుదువు ఇక్కడ.. అడ్మిషన్ అక్కడ... అన్నట్లుగా ఉన్నది. ఒకేషనల్ కళాశాలల్లో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎలక్ట్రికల్ కోర్సుల్లో అడ్మిషన్ పొందడానికి వచ్చిన విద్యార్థుల జీవితాలతో కళాశాల యాజమాన్యం ఆడుకుంటున్నది. నిబంధనల ప్రకారం ఒక్కొక్క కోర్సులో 40 సీట్లు మాత్రమే ఉంటాయి. ఒక కళాశాలలో సీట్లు భర్తీ అయితే విద్యార్థులకు తెలియకుండానే మరో కళాశాలకు అడ్మిషన్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఒక ఏడాది ఫీజు మా కళాశాలకు మరో ఏడాది ఫీజు మీ కళాశాలకు అని ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. కానీ పరీక్షల అనంతరం విద్యార్థి ఉత్తీర్ణత సాధిస్తే సర్టిఫికెట్‌ను ఏ కళాశాలలో తీసుకోవాలో తెలియక అయోమయంలో పడుతున్నారు. జిల్లాలో మొత్తం 12 ఒకేషనల్ కళాశాలలు ఉంటే ఇందులో మూడు ప్రభుత్వ, తొమ్మిది ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. తొమ్మిదింటిలో ఆరు కళాశాలలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి.

- వనపర్తి రూరల్, ఆంధ్రజ్యోతి



వనపర్తి పట్టణంలోని ఒకేషనల్ కళాశాల

6

సాగు సంకటం

- పగిలిన క్యాతూరు లిఫ్ట్ పైపులు
- రూ.26.52 కోట్లు కృష్ణార్పణం
- ఒక్క ఏడాది కూడా చివరి ఆయకట్టుకు నీరందలే
- నమ్మి సాగుచేస్తే నట్టేట ముంచుతున్న లిఫ్ట్
- మరమ్మతులు చేయించాలంటున్న రైతులు
- చేతులెత్తేసిన నిర్వహణ కమిటీ
- ప్రశ్నార్థకంగా మారిన పంటలు



క్యాతూరు లిఫ్ట్2



నీరు లేక ఎండుముఖం పట్టిన మిర్చిపంట

క్యాతూరు లిఫ్ట్-2 పైపులు పగిలిపోవడంతో సాగు సంకట స్థితిలో పడింది. సరిగ్గా ఆరేళ్ల క్రితం క్యాతూరు లిఫ్ట్‌ను ప్రారంభించారు. ఈ పనులు నాణ్యతా లోపంతో ఆరేళ్లలో ఎన్నోసార్లు పగిలాయి. అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. అవి పగులుతూనే ఉన్నాయి. ఇప్పుడు మరోసారి పైపులు పగలడంతో మిరప రైతులు ఆందోళన చెందుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం, క్యాతూరు, భీమవరం గ్రామాల పరిధిలోని సుమారు 3,450 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. క్యాతూరు లిఫ్ట్-2ను నమ్ముకొని రైతులు వానాకాలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో మిర్చి, మూడొందల ఎకరాల్లో కంది సాగు చేశారు. యాసంగిలో మొక్కజొన్న, మినుములు, పప్పుశనగ, వేరుశనగ, కంది, పొగాకు పంటలు సాగు చేశారు. పైపులు పగిలిపోవడంతో ఈ పంటలు ఎండుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పైపుల మరమ్మతు చేయించి పంటలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

6

- అలంపూర్ చౌరస్తా, ఆంధ్రజ్యోతి

ఆరుగురికి జీవిత ఖైదు

- ఒక్కొక్కరికి రూ. 3,500 జరిమానా
- వివరాలను వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు



జీవితకాలపు శిక్ష పడిన నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో ఒక వ్యక్తిని వేటకొడవళ్లతో నరికి హత్యచేసిన కేసులో ఆరుగురికి జీవితకాలపు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 3,500 జరిమానా విధించారు. ఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చెన్నిపాడు గ్రామానికి చెందిన పెద్ద కురుమన్నను హత్య చేసిన కేసులో ఆరుగురికి జీవితకాలపు జైలు శిక్ష విధిస్తూ బుధవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు మెజిస్ట్రేట్ కె.కుష తీర్పు ఇచ్చారని తెలిపారు. పెద్దకురుమన్నకు ఐదుగురు సోదరులు ఉన్నారు. 2012లో గణేష్ ఉత్సవాల్లో అదే గ్రామానికి చెందిన వరికుంట్ల ప్రసాద్ కుటుంబంతో పెద్దకురుమన్న కుటుంబానికి గొడవ జరిగింది. ఆ గొడవను మనసులో పెట్టుకొని పెద్దకురుమన్న తమ్ముడు మహేశ్‌ను 2014, మార్చిలో వరికుంట్ల ప్రసాద్, అతని కుటుంబ సభ్యులు హత్య చేశారు. ఆ కేసు ప్రస్తుతం మహబూబ్‌నగర్ కోర్టులో నడుస్తున్నది. ఈ కేసును పెద్దకురుమన్న రాజీపడనియ్యడం లేదని ఆయనపై కక్ష పెంచుకున్న వరికుంట్ల ప్రసాద్ వర్గీయులు 2016, ఫిబ్రవరి రెండున హత్య చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మానవపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ భగవంత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. తర్వాత నేరస్థులను కోర్టులో హాజరుపర్చగా పూర్వపరాలు విన్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు మెజిస్ట్రేట్ కె.కుష నిందితులైన వరికుంట్ల ప్రసాద్, వరికుంట్ల రామాంజనేయులు, వరికుంట్ల ప్రకాష్, వరికుంట్ల గంగారాజు వరికుంట్ల గర్కారాజు, వరికుంట్ల ప్రవీణ్‌లకు జీవితకాలపు జైలుశిక్ష విధించారని తెలిపారు. నిందితులకు శిక్షపడేలా చేసిన పోలీస్ అధికారులకు, పీపీలు ఆనంద్, వినోద్‌కుమార్, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అభినందించారు.

దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మరోసారి ఉద్యమస్ఫూర్తి రగిలించే విధంగా రేపు చేపట్టనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009, నవంబరు 29న కేసీఆర్ దీక్ష వల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. ఆనాటి ఉద్యమ స్ఫూర్తితో మన పార్టీ శ్రేణులలో ఉత్సాహం నింపుతూ కాంగ్రెస్ హామీల అమలు కోసం పోరాడాలని సూచించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కష్టపడి పని చేయాలని సూచించారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని అన్నారు. దీక్షా దివస్ విజయవంతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ మాజీ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి , కురుమూర్తి యాదవ్, నందిమల్ల అశోక్ పాల్గొన్నారు.

పాలమూరులో రైతు పండగ

- మూడు రోజుల పాటు సదస్సు
- ప్రారంభించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- నేడు ఐదు వేలు.. రేపు మరో ఐదు వేల మందికి సాగుపై అవగాహన
- 30న పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ముస్తాబైన అమిస్తాపూర్



సిద్ధమౌతున్న సభా వేదిక

మహబూబ్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మూడ్రోజుల రైతు సదస్సుకు పాలమూరు వేదిక కాబోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న తరుణంలో సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో తొలిసారి మూడురోజుల పాటు రాష్ట్ర రైతు సదస్సును నిర్వహిస్తున్నారు. భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామ శివారులో 28, 29, 30 తేదీలలో సభలు నిర్వహించనుండగా, ఇందుకోసం అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. మొదటి రోజు గురువారం ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదువేల మంది రైతులకు, 29న శుక్రవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మరో ఐదు వేల మంది రైతులను రప్పించి అవగాహన కల్పించనున్నారు.

30లోగా ధాన్యానికి వందశాతం చెల్లింపులు

ప్రభుత్వం పెద్ద ఎత్తున రైతు పండగ నిర్వహిస్తున్న (మిగతా 6లో..)

పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

- కాలుష్య నియంత్రణ బోర్డుకు ఫిర్యాదు

ఎర్రవల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లి శివారులో ఉన్న ఎస్ఎన్ఎస్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని బుధవారం హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ బోర్డుకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎన్ఎస్ పరిశ్రమ కాలుష్య నీటిని కృష్ణానదిలోకి సమీప వాగులోకి వదులుతున్నారని వాపోయారు. వాగులోకి వదిలే నీటి దుర్వాసనతో గ్రామాల్లో ఉండలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఈ పరిశ్రమపై తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నట్లు తెలిపారు. వినతి అందించిన వారిలో శ్రీధర్‌రెడ్డి, ఈరన్న, శేషు, వీరబాబు, గోవింద్ ఉన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

- జిల్లా కార్యనిర్వాహక సంచాలకుడు ఎంపీ రమేష్‌బాబు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గద్వాల న్యూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ ద్వారా బీసీలకు, ఎస్సీలకు రుణాలు అందిస్తున్నాం. జిల్లాలోని బీసీ వసతి గృహాలలో మౌలిక వసతులు కల్పిస్తాం. వసతి గృహ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా కార్యనిర్వాహక సంచాలకుడు ఎంపీ రమేష్‌బాబు అన్నారు.

జిల్లాలో బీసీ వసతి గృహాలు ఎన్ని ఉన్నాయి..?

జిల్లాలో మొత్తం 12 బీసీ వసతిగృహాలు ఉన్నాయి. ఇందులో ఎనిమిది ప్రీమెట్రిక్.. నాలుగు పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 1,824 మంది విద్యార్థులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా?

గతంలో కంటే ఇప్పుడు మెస్ చార్జీలు పెరుగడంతో విద్యార్థులకు పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను మెనూ ప్రకారం అందేలా చూస్తున్నాం.



జిల్లా కార్యనిర్వాహక సంచాలకుడు రమేష్‌బాబు

చలికాలంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

విద్యార్థులకు బ్లాంకెట్స్ దుప్పట్లు ఇస్తున్నాము. దీంతోపాటు కిటికీల మరమ్మతు కోసం ప్రపోజల్స్ పంపించాము. వచ్చే నెల మొదటివారంలోగా బడ్జెట్ వస్తుంది. మరమ్మతులు చేయించి చలికి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

విద్యాప్రమాణాలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారా..?

వసతిగృహాల్లోని విద్యార్థుల విద్యాప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేకంగా గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించేందుకు ట్యూటర్లను నియమించాం.

కార్పొరేషన్ ద్వారా ఎంతమందికి రుణాలు మంజూరు చేశారు..?

బీసీలకు రూ. లక్ష చొప్పున గతంలోనే 600 మందికి రుణాలు మంజూరు చేశాము. ఎస్సీలకు దళిత బంధు పథకంలో భాగంగా 200మందికి రూ.10లక్షలు చొప్పున అందించాం. మినీ డెయిరీ పథకంలో 285 మందికి ఒక్కొక్కరికి రెండు గేదేలు ఇచ్చాం. 100శాతం సబ్సిడీ ద్వారా 172 మందికి రూ. 50 వేలు నగదు అందించాం. కూరగాయల పందిరిసాగు కోసం 74 మందిని ఎంపిక చేసినా ఎవరూ తీసుకోలేదు.

కొత్తగా రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చా..?

ఇప్పటివరకు కొత్త రుణాల మంజూరు విషయంపై ఎలాంటి విధివిధానాలు రాలేదు. ఒక వేళ వస్తే అర్హులందరికీ రుణాలు మంజూరు అయ్యేలా చూస్తాం.

సాగు సంకటం

- క్యాతూరు లిఫ్ట్ పైపులు ధ్వంసంతో రైతులకు అడియాశే
- రూ.26.52 కోట్లు కృష్ణార్పణం - నమ్మితే నట్టేట ముంచింది
- ఒక్క ఏడాది కూడా చివరి ఆయకట్టుకు నీరంద లేదు
- మరమ్మతులు చేయించాలంటున్న రైతులు
- చేతులెత్తేసిన నిర్వహణ కమిటీ
- ప్రశ్నార్థకంగా వెయ్యి ఎకరాల మిరప పంట

అలంపూర్ చౌరస్తా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్కడ సాగు సంకటంగా మారింది. నీరందించే లిఫ్ట్ పగిలిపోవడంతో ఆ రైతులకు అడియాశే ఎదురైంది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలంలోని క్యాతూరు లిఫ్ట్-2 పైపులు పగిలిపోవడంతో సుమారు మూడువేల ఎకరాల్లో సాగు చేసిన వివిధ పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. సరిగ్గా ఆరేళ్ల క్రితం ప్రారంభించిన పథకం నెలలోపే పైపులు ధ్వంసమై మరమ్మతులకు నోచుకున్న ఘనత దీనికే సొంతం. అది మొదలు నేటివరకు పడుతూ లేస్తూ నడుస్తున్న క్యాతూరు లిఫ్ట్-2 ఆరేళ్లలో లెక్కలేనన్ని మార్లు మరమ్మతులకు గురైంది. తాజాగా ఇప్పుడు మరోసారి పైపులు పగిలిపోయి సంకట స్థితిలో పడింది. అలంపూర్ మండలం, క్యాతూరు, భీమవరం గ్రామాల పరిధిలోని సుమారు 3450 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ఎత్తిపోతల పథకం రుపొందించారు. క్యాతూరు లిఫ్ట్-2ను నమ్ముకుని రైతులు ఈ ఏట సుమారు వెయ్యి ఎకరాల్లో మిర్చి, మరో మూడు వందల ఎకరాల్లో కంది సాగుచేయగా యాసంగిలో మొక్కజొన్న, మినుములు, పప్పుశనగ, వేరుశనగ, కంది, పొగాకు పంటలు సాగు చేశారు.

వసూళ్లు ఘనం.. నిర్వహణ శూన్యం


క్యాతూరు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఆరేళ్ల క్రితం రూ.26.52కోట్లతో కృష్ణానది బ్యాక్ వాటర్ ఆధారంగా నిర్మించిన హరిహర సాగునీటి ఎత్తిపోతల పథకం నాణ్యతలేమి ఒక కారణమైతే.. ఏర్పాటైన కమిటీలు వసూళ్లపై పెట్టిన దృష్టి నిర్వహణపై పెట్టకపోవడంతో నమ్ముకున్న రైతుల ఆశలు గంగపాలు అవుతున్నాయి. 3450 ఎకరాలకు సాగునీరు అందిస్తామని 2018ఎన్నికలకు దగ్గర్లో ప్రారంభోత్సవంలో గొప్పలు చెప్పిన నాటి పాలకుల మాటలను నమ్మిన రైతులకు అందని ద్రాక్షగానే మారింది. కృష్ణానది బ్యాక్‌వాటర్ వద్ద నిర్మించిన పంపుహౌస్ నుంచి ఆర్డీఎస్ డీ-38, 39 డిస్ట్రిబ్యూటరీ వరకు పైపులైన్ నిర్మించి అక్కడి నుంచి ఆర్డీఎస్ కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. కానీ ఆరేళ్లలో పదుల సంఖ్యలో పైపులు ధ్వంసం అవుతున్నాయి. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో అనుకున్నంతగా బ్యాక్ వాటర్ నిలవలేదు. దీంతో లిఫ్ట్ మోటార్లకు నీరు అందని కారణంగా రెండునెలలు మాత్రమే నీటిని ఎత్తిపోశారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో కృష్ణా బ్యాక్ వాటర్ మరో మూడునెలల పాటు ఉంటాయని ఆయకట్టు రైతులు అంచనా వేశారు.

తీరా మోటార్లు ఆన్ చేసిన నెలరోజులకే రెండుచోట్ల పైపులు పగిలిపోయాయి. మరమ్మతు పనులు చేయడం సాధ్యం కాదని మమ్మల్ని మభ్యపెట్టేందుకు కృష్ణా బ్యాక్‌వాటర్‌లో మరోచోట పగిలిపోయాయని నమ్మిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన మిరప, కందితో పాటు యాసంగిలో కూడా పప్పుశనగ, వేరుశనగ, కంది పంటలు సాగు చేయగా అవి ఇప్పుడు మొలకదశలోనే ఉన్నాయి. లిఫ్ట్‌ను నమ్ముకుని చాలా మంది ఎకరం రూ.20 వేల నుంచి రూ.30వేలు వెచ్చించి కౌలు సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

చైర్మన్‌కే చెల్లించా.. కానీ రశీదు ఇవ్వలేదు

నేను గతేడాది చింతకాయ నాగిరెడ్డికి చెందిన పొలాన్ని కౌలుకు తీసుకున్నాను. ఎయిర్‌వాల్వ్ వద్ద లీకేజీ నీటిని వాడుకున్నందుకే చైర్మనే స్వయంగా నా వద్ద నుంచి రూ.5వేలు వసూలు చేశాడు. రశీదు అడిగినా ఇవ్వలేదు. ఇలా చాలా మంది రైతుల వద్ద రశీదులు ఇవ్వకుండా నీటి పన్ను వసూలు చేస్తున్నారు.

- బుచ్చన్న, క్యాతూరు గ్రామం, కౌలు రైతు



నీటితో కళకళలాడుతున్న కృష్ణానది

చేతులెత్తేసిన కమిటీ?

లిఫ్ట్‌ను నడిపించేందుకు ఆదిలోనే కమిటీ ఏర్పాటు చేసుకుని ఎకరాకు వెయ్యి చొప్పున నీటి పన్ను వసూలు చేసి నడిపించాలని సంకల్పించారు. కానీ రైతుల నుంచి వసూలు చేయడమే కానీ ఏనాడూ సకాలంలో మరమ్మతులు చేయించి నీరందించలేని దుస్థితిలో కమిటీ ఉంది. నాలుగేళ్ల క్రితం అప్పటి అధికార పార్టీకి చెందిన ఓ గ్రామ లీడర్‌ను అనధికారికంగా చైర్మన్‌గా నియమించగా ఆ వ్యక్తే అధికారపార్టీ తీర్థం పుచ్చుకుని కొనసాగుతున్నాడు. ఈ ఏడాది నుంచి ఎకరాకు రూ.200 చొప్పున పెంచి రూ.1200 లెక్కన వసూలు చేశారు. ఇప్పటికే దాదాపు రైతులందరి వద్ద వసూలు చేసినట్లు సమాచారం. ప్రతీ ఏటా సుమారు రూ.25 లక్షలకు పైగా వసూలు చేస్తుండగా ఈ ఏడాది ధర పెంచడంతో మరో నాలుగైదు లక్షలు ఆదనంగా కమిటీకి ముట్టినట్లు తెలుస్తున్నది.



క్యాతూరు లిఫ్ట్-2 కింద యాసంగి సాగుకు సిద్ధం చేసిన వ్యవసాయ భూమి

ఇప్పుడు మరమ్మతు సాధ్యం కాదు

మూడు చోట్ల పైపులు పగిలిపోయాయి. బ్యాక్‌వాటర్‌లో కూడా పైపులు పగిలిపోవడం చేత ఇప్పుడు మరమ్మతులు చేయించడం సాధ్యం కాని పని. వచ్చే ఎండాకాలమే రిపేర్లు చేయిస్తాం. కమిటీ వద్ద రూపాయి లేదని, మరమ్మతులు అయినప్పుడల్లా నేనే సొంత ఖర్చులు పెట్టుకుని చేయిస్తున్నాం. నీళ్లు వాడుకుని కూడా రైతులు డబ్బులు ఇవ్వడం లేదు. గతేడాది రెండు లక్షలు వసూలు అయితే తొమ్మిది లక్షలు ఖర్చు పెట్టామని చెప్పుకొచ్చారు.

- చంద్రశేఖర్‌రెడ్డి,
క్యాతూరు లిఫ్ట్-2 చైర్మన్

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

- తుర్కపల్లి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం
- అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ రావు



సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పీ రామేశ్వర్ రావు

మన్ననూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ రావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డివిజన్‌లోని పోలీస్ ఎస్ఐల ఆధ్వర్యంలో గ్రామంలో వేకువజాము నుంచే ఇళ్లలో సోదాలు నిర్వహించి ఇంటి ఆవరణలో ఉన్నటువంటి 75 ద్విచక్ర వాహనాలు, ఏడు ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకొని గ్రామంలో శివాలయం ముందుకు చేర్చారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ఆటోలను అమ్రాబాద్ ఠాణాకు తరలించి వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి నిర్వహించిన అవగాహన సమావేశంలో అదనపు ఎస్పీ మాట్లాడారు. సైబర్‌క్రైం, డ్రగ్స్ నిర్మూలన, మహిళల రక్షణ , వాహనాల కొనుగోలు, అమ్మకాలు చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఏదేని నేరాలు జరిగిన సందర్భంలో స్థానిక పోలీస్ స్టేషన్లలో బాధితులు ఫిర్యాదు దరఖాస్తులు చేసుకొని అట్టి రశీదులను తీసుకోవాలని కోరారు.

ప్రజల్లో శాంతియుత వాతావరణాన్ని కల్గించేందుకే పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల యొక్క రిజిస్ట్రేషన్ పత్రాలను చూపించి మీ వాహనాలను తీసుకెళ్లాలని కోరారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, అమ్రాబాద్ సీఐ శంకర్‌నాయక్, అమ్రాబాద్, అచ్చంపేట ఎస్ఐలు రజిత, ఇందిరమ్మ, రమేష్ పాల్గొన్నారు.

సంబురంగా స్వర్ణోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

రాంగోపాల్ రావు, ప్రొఫెసర్ జయరాం రెడ్డి, తెలంగాణ సరస్వతి అధ్యక్షుడు ఏలూరు శివారెడ్డి హాజరయ్యారు.



కొల్లాపూర్‌లో ఆర్ఐడీ పాఠశాల స్వర్ణోత్సవాలకు హాజరైన పూర్వ విద్యార్థులు

ముందుగా సరస్వతి దేవికి పూజ, జ్యోతి ప్రజ్వలన అనంతరం అమరత్వం పొందిన పూర్వ విద్యార్థులకు నివాళులర్పించారు. అనంతరం స్వర్ణోత్సవాలని ర్వాహక అధ్యక్షుడు డాక్టర్ కటికనేని సాయిప్రసాదరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... తాను 1969 వరకు ఆర్ఐడీలో చదువుకున్నానని, తాను ఈ స్థాయికి చేరడానికి గురువులే కారణం అని తెలిపారు. తాను బాల్యంలో బడికి డుమ్మా కొట్టి ఐదు పైసలకు కిరాయి సైకిల్ తొక్కేవాడినని, అలాగే తొక్కుడు బిల్ల ఆడేవాడి నని గుర్తు చేశారు.

పట్టణంలో ఇప్పుడున్న తహసీల్దార్ కార్యాలయం, కోర్టు భవనం, ఆర్ఐడీ హై స్కూల్, జూనియర్ కాలేజీ వంటి పలు భవనాలు సురభి రాజులు ఇచ్చినవేనని తెలిపారు. తనతో కలిసి చదువుకున్న వారిలో కొందరి పేర్లు, అలాగే చిన్నపుడు చదువు చెప్పిన ఉపాధ్యాయులు పురుషోత్తమరావు, అనంతరాం శర్మ, ఈశ్వరయ్యగౌడ్ పేర్లను స్మరించుకున్నారు. తమ కుటుంబ సభ్యులుగా భావించి ఆనాడు గురువుల ఇళ్ల వద్ద ట్యూషన్స్ చెప్పే వారని గుర్తు చేశారు. పూర్వ విద్యార్థి ఢిల్లీ బిట్స్ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ రాంగోపాల్ రావు మాట్లాడుతూ.. తాను చదివిన ఆర్ఐడీ పాఠశాల భవనం ఉత్సవాల సందర్భంగా రూపురేఖలు మారడం సంతోషంగా ఉందన్నారు. ప్రొఫెసర్ జయరాంరెడ్డి ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ దయాసాగర్, తెలంగాణ సరస్వతీ పరిషత్ అధ్యక్షుడు ఏలూరి శివారెడ్డి తదితరులు తమ బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉత్సవాలకు దేశ విదేశాల్లో స్థిర పడిన పూర్వ విద్యార్థులు రావడంతో పట్టణం లో పండుగ వాతావరణం సంతరించుకున్నది.

కొల్లాపూర్ పట్టణంలో ప్రధాన రోడ్డు డివైడర్లపై పూల మొక్కలను నాటారు. సమావేశంలో కటి కనేని విమల, స్వాతి, మునిసిపల్ చైర్‌పర్సన్ రమ్య, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిముదా బేగం మాట్లాడారు. కళాకారులు పాటలతో అలరింపజేశారు.

రైలుకింద పడి మహిళ ఆత్మహత్య

కోస్గి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోస్గి పట్టణం తిమ్మాయిపల్లికి చెందిన మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తిమ్మాయిపల్లికి చెందిన లలిత (35) తన భర్త మొగులప్పతో గొడవపడింది. ఈ క్రమంలో గురువారం ఉదయం సుమారు 10గంటల ప్రాంతంలో వికారాబాద్ జిల్లా తాండూర్ వెళ్లి రైలు వస్తున్న క్రమంలో దానికింద పడి మృతి చెందింది.

ప్రత్యేక కోర్సులు ప్రవేశపెడతాం

- ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో రెగ్యులర్ కోర్సులతో పాటు నైపుణ్యాన్ని, ఉపాధి ఆధారిత ప్రత్యేక కోర్సులు ప్రవేశపెడతామని ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్ అన్నారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కరికులం రూపకల్పన జరిగినట్లు తెలిపారు. బుధవారం పాలమూరు యూనివర్సిటీలో చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం జరిగిన ఇండక్షన్ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. వివిధ సంస్థలు, కంపెనీలతో ఎంవోయూ కుదుర్చుకొని కోర్సు పూర్తికాగానే విద్యార్థికి ఉపాధి కలిగేవిధంగా చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. అంతకుముందు ముఖ్యవక్తగా గ్లోబల్ స్పీకర్ రమేష్ వేముగంటి మాట్లాడుతూ నిరంతరం అభ్యసనం చేయడం ద్వారా జ్ఞానం పెంపొంది, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. జ్ఞానం పెరగాలంటే ప్రశ్నించే ధోరణిని అలవరుచు కోవాలని, ప్రపంచీకరణ నేపథ్యంలో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటున్నాయని అన్నారు. మరో వక్త విజయ్‌మోహన్ మాట్లాడుతూ యూనివర్సిటీల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరమని అన్నారు.

అలుమినీ అసోసియేషన్ కీలకంగా ఉంటుందని, పోటీ పరీక్షలకు అవసరమైన వసతులు అన్ని పీయూలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డీన్ ప్రొఫెసర్ జైపాల్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ నూర్జహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కృష్ణయ్య, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యవక్త గ్లోబల్ స్పీకర్ రమేష్‌ను సన్మానిస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, అధికారులు

టెంకాయల వేలం పాట

- రూ.65.80 లక్షలు సమకూరిన ఆదాయం

గద్వాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) నడిగడ్డలో భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న జములమ్మ దేవస్థానంలో బుధవారం టెంకాయల వేలం పాట నిర్వహించారు. ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం రెండు గంటలకు వేలం పాట నిర్వహించారు. మొదట టెంకాయల విక్రయానికి వేలం పాట నిర్వహించగా ఏడుగురు పోటాపోటీగా పాట పాడారు. అందులో గద్వాల పట్టణానికి చెందిన పులిపాటి నాగేష్ రూ.50.04లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.5.69 లక్షలు అధికంగా సమకూరింది. టెంకాయల చిప్పలసేకరణకు వేలం నిర్వహించగా 11మంది పాటలో పాల్గొన్నారు. ఇందులో రావూరి ఓంప్రకాష్ కామ్లే 12.22లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ. 5.55లక్షలు అధికంగా సమకూరింది.

అదేవిదంగా మొదటిసారి అమ్మవారి చీరలకు వేలంపాట నిర్వహించగా ఏడుగురు వేలంపాటలో పాల్గొన్నారు. రూ.3.54లక్షలకు గద్వాలకు చెందిన రావూరి ఓంప్రకాష్ కామ్లే దక్కించుకున్నారు.

లడ్డూ ప్రసాదం విక్రయానికి వేలం పాట నిర్వహించగా ఐదుగురు పాల్గొన్నప్పటికీ గత ఏడాది పాడిన పాటకు సమానంగా వేలం రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఈ ఏడాది టెంకాయల విక్రయం, చిప్పల సేకరణ, చీరల వేలం ద్వార రూ.65.80లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఆలయ సిబ్బంది మురళీధర్‌రెడ్డి, రవిప్రకాష్, రాజలింగం, నాగరాజు తదితరులు ఉన్నారు.

చదువు ఇక్కడ.. అడ్మిషన్ అక్కడ..

● ఒకేషనల్ కళాశాలల యాజమాన్యాల తీరు
● ఉత్తీర్ణులైనా సర్టిఫికెట్ల కోసం పడిగాపులు



వనపర్తి పట్టణ కేంద్రంలోని ఒకేషనల్ జూనియర్ కళాశాల

వనపర్తి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ కోర్సుల పేర విద్యాసంస్థలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. చదువులు ఒకచోట నడుస్తుంటే.. మరోచోట అడ్మిషన్లు తీసుకుంటూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అదనపు శిక్షణ అవసరం లేని ఒకేషనల్ కోర్సులు కెరియర్‌లో స్థిరపడటానికి చిన్న నైపుణ్యాలు దారి చూపుతాయనే ఉద్దేశంతో చాలా మంది అడ్మిషన్ పొందడానికి మొగ్గు చూపుతుంటారు. పదవ తరగతి దాటిన తరువాత ఈ ఒకేషనల్ కోర్సులో అడ్మిషన్ పొందుతారు. రెండు సంవత్సరాల పాటు ఈ కోర్సు చేసే విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.5000 చొప్పున రెండు సంవత్సరాల పాటు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ను ఆయా కళాశాలలకు అందిస్తుంది. మొదటగా విద్యార్థులను అడ్మిషన్ చేసుకునే ముందు మీరు ఎటువంటి ఫీజు చెల్లించవలసిన అవసరం లేదు అని వారితో నమ్మబలికి వారితో అడ్మిషన్ చేయించుకుంటున్నారు. అదే అదునుగా భావించిన ఒకేషనల్ జూనియర్ కళాశాల యాజమాన్యాలు ప్రైవేటు బిల్డింగ్‌లోనే కాకుండా ఇళ్లను అద్దెకు తీసుకుని ఒకేషనల్ కాలేజీగా మారుస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్నారు.

ఏది ఏమైనప్పటికీ ఒకేషనల్ కళాశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకేషనల్‌లో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎలక్ట్రికల్ కోర్సుల్లో అడ్మిషన్ పొందడానికి వచ్చిన విద్యార్థులను ఆయా కాలేజీల్లో యాజమాన్యాలు అడ్మిషన్ చేయించుకుంటున్నారు. ఆ కళాశాలల్లో ఒక్కొక్క కోర్సులో 40 మంది విద్యార్థులకు మాత్రమే సీట్లు ఉంటాయి. ఆ సీట్లు భర్తీ అయితే వాళ్లకు తెలియకుండానే మరో కాలేజీలో ఒక సంవత్సరం ఫీజు మా కళాశాలకు.. ఒక సంవత్సరం ఫీజు మీ కళాశాలకు అని ఒప్పందాలు కుదుర్చుకుని అక్కడ అడ్మిషన్ చేస్తున్నారు. పరీక్షల అనంతరం విద్యార్థి ఒక వేల ఉత్తీర్ణత సాధిస్తే సర్టిఫికెట్ చేతికి రావడం కష్టంగా ఉంది. అదే విద్యార్థి ఒకవేళ మొదటి సంవత్సరం ఉత్తీర్ణత సాధించకపోతే సర్టిఫికెట్ల పరిస్థితి ఏందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో మొత్తం 12 ఒకేషనల్ కోర్సు కళాశాలలు ఉండగా మూడు ప్రభుత్వం, తొమ్మిది ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. తొమ్మిది ప్రైవేటు కళాశాలల్లో కేవలం ఆరు కళాశాలలకు మాత్రమే పర్మిషన్లు ఉన్నాయి. ఒకేషనల్ కళాశాలలో పర్మిషన్ లేకపోవడమే కాకుండా విద్యార్థుల సర్టిఫికెట్లను తమ వద్ద ఉంచుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

కలెక్టర్ చొరవ తీసుకొని మా సర్టిఫికెట్లు ఇప్పించాలి



కేజీఎన్ ఒకేషనల్ కళాశాలలో 2021 సంవత్సరంలో ఒకేషనల్‌లో అడ్మిషన్ అయ్యాను. నా కోర్సు పూర్తయ్యాక నా సర్టిఫికెట్ ఇవ్వమంటే ఇవ్వడం లేదు. కేజీఎన్ ఒకేషనల్ కళాశా ల యాజమాన్యాన్ని అడిగితే స్వర్ణ భారతి ఒకేషనల్ కళాశాలలు ఉన్నాయని, స్వర్ణ భారతి ఒకేషనల్ కళాశాలలో అడిగితే కేజీఎన్‌లో ఉన్నాయని చెబుతూ కాలం దాటవేస్తున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

- సురేందర్, విద్యార్థి

సర్టిఫికెట్లు ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటాం



ఒకేషనల్ కళాశాలలో విద్యార్థులకు సంబంధించిన కోర్సు పూర్తి అయితే వారికి సంబంధించిన సర్టిఫికెట్లకు వారికి అందజేయాలి. సర్టిఫికెట్ ఇవ్వడం లేదని నా దృష్టికి రాలేదు. ఒకవేళ నా దృష్టికి వస్తే ఆయా కళాశాలలపై చర్యలు తీసుకుంటాం.

డీఐఈవో అంజయ్య

పాలమూరులో నేటి నుంచి రైతు పండగ

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో సీఎం సభకు వచ్చే 30 నాటికి ఉమ్మడి జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలలో కొన్న ధాన్యానికి రూపాయి బకాయి లేకుండా మొత్తం క్లియర్ చేయాలని ప్రభుత్వం కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా కొనుగోలు చేసిన సన్నధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించాలని, ఏ ఒక్కరికీ బకాయి లేకుండా చూసుకోవాలని ఆదేశాలిచ్చింది. దాంతో రైతుల అకౌంట్లలో డబ్బులు జమచేయనున్నారు. రైతు పండగ ముఖ్యంగా రుణమాఫీ, వరికొనుగోలు కేంద్రాలు, సన్నాలకు రూ.500 బోనస్ పైనే ప్రధానంగా సాగనుంది.

నేడు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

రైతు సదస్సును రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. ఆయనతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొననున్నారు. రైతు అవగాహన కార్యక్రమాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతోపాటు వివిధ కంపెనీలు, రైతు సంస్థలు, ప్రొఫెసర్లు, ఆదర్శ రైతులు పాల్గొననున్నారు.

భారీ బందోబస్తు

సదస్సు నేపథ్యంలో పోలీస్‌శాఖ భారీ బందోబస్తును ఏర్పాటుచేస్తోంది. ముఖ్యంగా 30న జరిగే సీఎం రేవంత్ బహిరంగ సభకు అధిక సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరుకానుండటంతో పోలీస్‌శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలతో పాటు నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. ఐజీ, జోగులాంబ జోన్ డీఐజీ పర్యవేక్షణలో మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ఆధ్వర్యంలో నలుగురు ఎస్పీలు, ఐదుగురు ఏఎస్పీ, 12 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 80 ఎస్ఐలు, ఏడుగురు మహిళా ఎస్ఐలు, ఏఎస్ఐలు, 95 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 700 మంది కానిస్టేబుళ్లు, 130 మంది మహిళా పీసీలు, 174 మంది హోంగార్డులు, ఏడు రోప్ పార్టీ లు, ఎనిమిది స్పెషల్ పార్టీలు, మూడు సీపీటీ టీమ్‌లు, మూడు ట్రోప్ క్యారియర్ పార్టీలు, మూడు బుషెష్ పార్టీలు, ఐదు స్పెషల్ ప్రొటెక్షన్ టీమ్‌లు బందోబస్తులో పాల్గొనున్నాయి. బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేయడంతో పాటు, రెండు గ్రేహౌండ్స్ దళాలు సభా ప్రాంగణం చుట్టూ గుట్టల్లో కూంబింగ్ నిర్వహించనున్నాయి. ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, జిల్లా ఎస్పీ జానకి బుధవారం సభాప్రాంగణాన్ని పరిశీలించారు.



పోలీస్ అధికారికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భారీగా రైతులు : ఎమ్మెల్యేలు

భూత్పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదిన జరిగే రాష్ట్రస్థాయి వ్యవసాయ పండుగను భారీ మొత్తంలో రైతులు తరలివచ్చే విధంగా అన్నీ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు దేవరకద్ర, మహబూబ్‌నగర్ నియోజవర్గాల ఎమ్మెల్యేలు మధుసూధన్‌రెడ్డి, యన్నెం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రజాపాలన విజయోత్సవ సభా వేదిక వద్ద మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. రైతులకు లాభసాటి వ్యవసాయ సాగు, ఇతర ఆధునిక వ్యవసాయ పంటల సాగుకు అనువుగా రైతులకు ఉపయోగ పడే 120 స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యేలు వివరించారు. దాదాపు రాష్ట్రం మొత్తంలో 1.50 లక్షల మంది రైతులు ఈ ప్రదర్శనను పరిశీలించేందుకు హాజరవుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే విధంగా ఈ నెల 30వ తేదీన జరిగే ముగింపు సభా కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅథితులుగా హాజరై రైతులకు శుభ వార్తలు అందిస్తారన్నారు. ముఖ్యంగా రైతు రుణమాఫీ పెండింగ్ ఉన్న వాటిని త్వరలో రైతులకు అందే విధంగా ముఖ్యమంత్రి ప్రకటిస్తారని ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యేలు కలెక్టర్ విజయందిరబోయి, అధికారులతో కలిసి సభా ఏర్పాట్ల ను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ మా సగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బెనహర్ ఉన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

జాతీయ టోర్నీలో ప్రతిభ చాటాలి

▸ ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్



సయ్యద్ అఖిల్‌ను సన్మానిస్తున్న ఎన్‌పీ వెంకటేశ్, ఉషూ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్, కోశాధికారి ఇలియాజ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ చాటి, పతకాలను సాధించాలని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో వచ్చేనెల ఒకటి నుంచి ఆరవ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ ఉషూ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు సయ్యద్ అఖిల్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతడిని ఘనంగా సన్మానించారు. పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. గుర్తింపు ఉన్న క్రీడలతోనే భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉషూ సంఘం జిల్లా అధ్యక్షుడు షకీల్, ట్రెజరర్ ఇలియాజ్, మాస్టర్ అశ్వాక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు రాజారాంచరణ్



రాజారాంచరణ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల గ్రామానికి చెందిన రాజారాంచరణ్ బాస్కెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని కీ స్టోన్ అకాడమీలో నిర్వహించిన ప్రత్యేక కోచింగ్ క్యాంపులో పాల్గొని మెరుగైన ప్రదర్శనతో రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. బెంగాల్ రాష్ట్రం, కోల్‌కతలో ఈ నెల 29 వచ్చేనెల ఐదవ తేదీ వరకు నిర్వహించనున్న 39వ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనను న్నాడు. ఈ సందర్భంగా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మక్బుద్ బిన్ అహ్మద్ జాకీర్, నసురుల్లా హైదర్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మల్దకల్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం వెంకటనర్సయ్య, పీఈటీ నరేశ్

మల్దకల్, గద్వాల అర్బన్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అమరవాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తేజస్విని (8వ తరగతి), త్రివేణి (9వ తరగతి), కేశవర్ధన్ (9వ తరగతి), లోకేశ్ (9వ తరగతి) రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుంచి వచ్చేనెల ఒకటవ తేదీ వరకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ జీజీహెచ్ మైదానంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయుడు నరేశ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు నరేశ్‌తో పాటు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆనంద్, ఏఏపీ చైర్మన్ మరియమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే గద్వాల ప్రభుత్వ అభ్యసన పాఠశాలలో చదువుకుంటున్న ఏడవ తరగతి విద్యార్థి రాహుల్ కూడా అండర్ -14 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటనర్సయ్య, పీఈటీ నరేశ్ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా అండర్-19 వాలీబాల్ బాల, బాలికల జట్ల ఎంపికకు ఈ నెల 27న పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా గుండుమాల్ మండల కేంద్రంలోని ఏకే వాలీబాల్ అకాడమీలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు పదవ తరగతి మెమో జిరాక్స్, ఒరిజినల్ బోనఫైడ్‌తో హాజరుకావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు దామరగిద్ద విద్యార్థిని



విద్యార్థిని కవితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దామరగిద్ద, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని పసుల కవిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. జిల్లా స్థాయి ఎస్‌జీ ఎఫ్ అండర్ - 8 రన్నింగ్ పోటీల్లో కవిత ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రధానోపాధ్యాయురాలు అలవేలుమంగ తెలిపారు. పాఠశాలలో మంగళ వారం విద్యార్థినిని కవితను సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ వచ్చేనెల ఒకటిన మంచిర్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో కవిత పాల్గొననున్నదని చెప్పారు. పోటీల్లో రాణించి మండలానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజ, విజయలక్ష్మి, రాణి, అంబరీష్, నాగేందర్ పాల్గొన్నారు.

కాలుష్యకారక పరిశ్రమలను రద్దు చేయాలి

▸ పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్

పాలమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య కారక ఇథనాల్, ఫార్మా పరిశ్రమలను వెంటనే రద్దు చేయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బహుళ జాతి కంపెనీలు, దేశ విదేశ కార్పొరేట్ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో రైతులు భూములు కోల్పోయి నిర్వాసితులుగా మారుతున్నారని తెలిపారు. భూములు, ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపారాలు, నీళ్లు, నిధులు స్థానికులకే దక్కాలని తెలంగాణ రైతాంగం, ఇతర ప్రజానీకం పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేశారు. మౌలిక లక్ష్యాలను గాలికి వదిలేసి రైతాంగాన్ని, పర్యావరణాన్ని బలి తీసుకునే విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఏమీ తేడా లేదని పేర్కొన్నారు. తెలంగాణలో 30 ఇథనాల్ కంపెనీలు, ఇరవైకి పైగా ఫార్మా కంపెనీలు రాబోతున్నాయని పేర్కొన్నారు. ఈ కంపెనీలతో తెలంగాణ భూములు కలుషితమవు తాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరళీకరణ ఆర్థిక విధానాల నుంచి దేశం బయటికి రావాలని, స్థానిక ప్రయోజనాలను కాపాడే విధానాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

'పాడి'దిద్దిన కాపురం

▸ వ్యవసాయం కలిసి రాక నష్టాల పాలైన కుటుంబం ▸ ఉపాధి కోసం గేదెల పెంపకం చేపట్టిన భీముడు

▸ రోజూ 50 లీటర్ల పాల విక్రయం ▸ ప్రతీ నెల ఖర్చులు పోను రూ. 30 వేలు ఆదాయం

వ్యవసాయం కలిసి రాలేదు. పంటల సాగు కోసం చేసిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. కుటుంబ పోషణ భారమైంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఉపాధి వైపు అడుగులు వేశారు. పాల వ్యాపారాన్ని ఎంచుకున్నారు. నాలుగు గేదెలతో మొదలు పెట్టిన వారి దగ్గర ప్రస్తుతం 21 గేదెలు ఉన్నాయి. పాలద్వారా వచ్చిన ఆదాయం వారి కుటుంబాన్ని నిలబెట్టింది.



పశువులకు మేత వేస్తున్న భీముడి కుమార్తె త్రివేణి

అయిజ టౌన్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మునిసిపాలిటీకి చెందిన బోయ భీముడు, నాగేశ్వరి దంపతులకు ఒక కుమారై, ఇద్దరు కుమారైలు ఉన్నారు. ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం జీవనం గడుపుతున్నారు. పంటలు పండక, పండినా గిట్టుబాటు ధర దక్కక తీవ్రంగా నష్టపోయారు. ఇలాగే కొనసాగితే కుటుంబ పోషణ భారం కావడమే కాకుండా, పిల్లలను చదివించుకోవడం కష్టమవుతుందని భావించారు. వ్యవసాయాన్ని వదిలి, రూ. 50 వేలు అప్పు చేసి నాలుగు గేదెలను కొనుగోలు చేశారు. వాటిని శ్రద్ధగా పోషించుకుంటూ, పశువుల సంఖ్యను పెంచుకున్నారు. ప్రస్తుతం వారి వద్ద 14 పాలిచ్చే గేదెలతో పాటు, మరో ఏడు ఉన్నాయి. ఇటీవలే రూ. 80 వేలు గౌడి గేదెను కొనుగోలు చేశారు. పాల ద్వారా వస్తున్న ఆదాయంతో కుమార్తెను డిగ్రీ వరకు చదివించారు. ఒక కుమారుడు ఇంటర్ వరకు చదువుకొని తండ్రికి ఆసరాగా ఉంటున్నాడు. మరో కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు.

ప్రతీ రోజు 50 లీటర్ల పాల విక్రయం

ప్రతీ రోజు 50 లీటర్ల పాలను పట్టణ ప్రజలకు, వ్యాపారులకు విక్రయిస్తున్నారు. చిక్కటి పాలు పోస్తుండటంతో ఎక్కువ మంది వీరి వద్దే కొనుగోలు చేస్తున్నారు. లీటరుకు 70 రూపాయల చొప్పున ప్రతీ రోజు రూ. 3,500 ఆదాయం లభిస్తోంది. మొత్తంగా ప్రతీ నెల దాదాపు లక్ష రూపాయల వరకు సంపా దించుకుంటున్నారు. అందులో గేదెలకు అవసరమైన మేత దాణా, తదితరాలకు రూ. 60 వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. రూ. 30 వేలకు పైగా మిగులు తోంది. వారు పోషిస్తున్న గేదెల్లో కొన్ని లక్ష రూపాయల ధర పలుకుతోంది. ఇటీవలే అయిజ సంతలో గౌడి రకానికి చెందిన గేదెను రూ.90 వేలు వెచ్చించి కొన్నట్లు భీముడు తెలిపారు. ఈ గేదె ఉదయం నాలుగు, సాయంత్రం మూడు లీటర్ల పాలు ఇస్తున్నట్లు చెప్తున్నారు.

వ్యవసాయంలో అప్పే మిగిలింది



గేదెల పెంపకాన్ని 25 ఏళ్ల క్రితం మొదలు పెట్టాను. అప్పట్లో నాకున్న కొద్ది పాటి పొలంతో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేశాను. దిగుబడి రాకపోగా, చేసిన అప్పులు కూడా తీర్చలేక పోయాను. ఏమి చేయాలో తోచక భార్యతో ఆలోచించి, వ్యవసాయం వదిలి, గేదెలు పెంపకం చేపట్టాను. పాల వ్యాపారంతో ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది.

\- భీముడు

పిల్లలను ప్రయోజకుల్ని చేశాం



నాగేశ్వరి : వ్యవసాయంలో నష్టాలు తప్పవని, పిల్లల చదువులు కూడా ఇబ్బందిగా మారుతాయని గ్రహించాం. పాడి గేదెలను పెంచుకున్నాము. పాల ద్వారా వచ్చే ఆదాయంతోనే ముగ్గురు పిల్లలను చదివించుకుంటున్నాం. వ్యవసాయంపైనే ఆధారపడితే కుటుంబ పోషణ భారం అయ్యేది.

అమ్మా నాన్న చాలా కష్టపడతారు



త్రివేణి : అమ్మా నాన్న ప్రతీ రోజు గేదెలను మేపుతూ, పాల ద్వారా వచ్చే అదాయంతోనే కుటుంబాన్ని పోషిస్తున్నారు. తమ్ముళ్లు చదువుకుంటూనే, నాన్నకు పనుల్లో సాయపడుతున్నారు. వారి కష్టం చూస్తే బాధ అవుతోంది. అందుకే నేను బాగా చదువుకున్నాను.

అమ్మకానికి బోనఫైడ్



మహబూబ్‌నగర్ పట్టణంలోని మండల రిసోర్స్ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు వచ్చినప్పుడు బోనఫైడ్‌లో ఉన్న అడ్మిషన్ నంబర్, వారికి ఇచ్చిన నంబర్ సరిపోలక ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తోంది.

బోనఫైడ్ ఎప్పుడు అవసరం అవుతుంది?

ఉద్యోగ నియామకం సమయంలో లోకల్ కోసం అభ్యర్థులకు, మెడిసిన్, ఇంజనీరింగ్, ఇతర పైచదువుల కోసం విద్యార్థులకు బోనఫైడ్ తప్పనిసరి అవుతుంది. దాంతో ఆయా అవసరాల కోసం బోనఫైడ్ అవసరం అయిన వారు చదివిన ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. అయితే అధికారికంగా ఒకటి, అనధికారికంగా ఒకటి అడ్మిషన్ రిజిష్టర్లు మెయింటెన్ చేస్తున్న పాఠశాలలు.. స్కూల్ మూత పడితే ఒక రిజిష్టర్‌ను విద్యాశాఖకు అప్పగిస్తున్నాయి. అనధికార రిజిష్టర్ వారి వద్దే ఉంచుకుంటున్నాయి. అందులో ముందుగానే కొన్ని అడ్మిషన్ పేజీలను వివరాలు నమోదు చేయకుండా వదిలేస్తాయి. ఎవరైనా బోనం ఫైడ్ కోసం వెళ్తే డబ్బులు తీసుకుని, అ ఖాళీ పేజీల్లో వివరాలు నమోదు చేసి, ఇస్తున్నాయి. దాంతో వాళ్ల ఇచ్చిన బోనం ఫైడ్ వివరాలు, విద్యాశాఖ వద్ద ఉన్న రిజిష్టర్‌లో సరిపోక నిజమైన అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

లోకల్‌గా ఎప్పుడు పరిగణిస్తారు?

జిల్లాలో లోకల్ కావాలంటే ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఆ జిల్లాలో చదివి ఉండాలి. లేదంటే విద్యాభ్యాసంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు సంగం కంటే ఎక్కువ భాగం ఏ జిల్లాలో చదివితే.. లోకల్‌గా పరిగణిస్తారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందే సమయంలో దాన్ని పరిగణలోకి తీసకుని అభ్యర్థిని ఆ జిల్లా లోకల్‌గా పరిగణిస్తారు.

పట్టించుకోని విద్యాశాఖ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వెయ్యికిపైగా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ రికార్డు ఎంతో ముఖ్యమైనది. అందులో విద్యార్థి పాఠశాలలో ఎప్పుడు జాయిన్ అయ్యాడు, ఎప్పుడు వెళ్లిపోయాడు, పుట్టిన తేదీ, పుట్టుమచ్చలు తదితర వివరాలు నమోదు చేస్తారు. ఈ రికార్డు విద్యార్థి జీవితకాలం అవసరం వస్తుంది. ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థికి ఏదైన ప్రభుత్వ ఉద్యోగం వస్తే అధికారులు ఆ రికార్డులలో ఉన్న వివరాలను తనిఖీ చేస్తారు. ధ్రువపత్రాల విషయంలో చిన్న అనుమానం ఉన్నా ఆ రికార్డును అక్కడి తెప్పించుకొని పరిశీలిస్తారు. కొన్ని సందర్భాలలో ఆ రికార్డులలో విద్యార్థుల అడ్మిషన్ నంబర్, ఇతర వివరాలు ఉండటం లేదు. స్కూల్స్ అధికారికంగా ఒకటి, అనధికారికంగా ఒకటి అడ్మిషన్ రిజిష్టర్లను మెయింటెన్ చేయడం వల్ల ఈ పరిస్థితి నెలకొంటోంది. దాంతో అభ్యర్థులు వచ్చిన ఉద్యోగాలను కోల్పోతున్నారు. ప్రైవేట్ పాఠశాలు చేసిన తప్పిదాలకు బలవుతున్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.

అధికారులు ఏడాదిలో కనీసం రెండు నుంచి మూడు పర్యాయాలైన ప్రైవేట్ పాఠశాలల రికార్డులను పరిశీలించాలి. కానీ ఏడాదికి ఒక్కసారి కూడా తనిఖీలు చేయడం లేదు. డిప్యూటీ డీవోలు ఉన్న సమయంలో తనిఖీలు చేస్తుండగా, ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది.

పాఠశాలలను తనిఖీ చేస్తాం



బోనఫైడ్‌లు డబ్బులు తీసుకుని విక్రయించారన్న విషయమై ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేస్తాం. అక్రమాలకు పాల్పడ్డారని తెలితే కఠిన చర్యలు తీసుకుంటాం. టీసీ పుస్తకం తరహాలో.. బోనఫైడ్‌కూ పుస్తకం ఇచ్చేలా చూస్తాం. మూతపడ్డ పాఠశాలలపై దృష్టి పెడతాం. ఉన్న స్కూల్స్ కూడా నిబంధనలకు విరుద్ధంగా ధ్రువపత్రాలు ఇవ్వొద్దు. పట్టుబడితే చర్యలు తప్పవు.

\- ఎ. ప్రవీణ్‌కుమార్, డీఈవో మహబూబ్‌నగర్

వేడి నూనె పడి విద్యార్థినికి గాయాలు

▸ నవాబ్‌పేట కేజీబీవీలో ఘటన ▸ ఇన్‌చార్జి ఎస్‌వో ప్రశాంతికి మెమో



చేతిపై గాయంతో విద్యార్థిని జల్సా

నవాబ్‌పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట కస్తూర్బా బాలికల విద్యాలయంలో వేడి నూనె పడి ఓ విద్యార్థినికి స్వల్ప గాయాలయ్యాయి. పాఠశాల సిబ్బంది బాలికకు వెంటనే వైద్యం చేయించకుండా ఇంటికి పంపించింది. కిషన్ గూడ గ్రామానికి చెందిన జల్సా అనే విద్యార్థిని కేజీబీవీలో తొమ్మిదవ తరగతి చదువుతున్నది. సోమవారం సాయంత్రం మెనూలో భాగంగా పూరీలు ఇవ్వాల్సి ఉంది. అందు కోసం వంట సిబ్బందితో కలిసి ఇద్దరు, ముగ్గురు విద్యార్థినులు కూడా పూరీలు చేస్తుండగా, జల్సా అనే విద్యార్థినిపై మసులుతున్న నూనె పడింది. దీంతో ఎడమ చేయి, కాలిపై గాయాలయ్యాయి. కానీ వెంటనే ఆసుప్రతికి తీసుకెళ్లలేదు. మంగళవారం ఉదయం ఆధునిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. అనంతరం తల్లిని పిలిపించి బాలికను గ్రామానికి పంపించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రశాంతిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా విద్యార్థులు వంట సిబ్బందితో కలిసి పూరీలు వేస్తున్నప్పుడు నూనె పడి గాయాలయ్యాయని తెలిపారు. పెద్ద సంఘటన కాదన్నట్లుగా మాట్లాడారు.

సంఘటనపై విచారణ

సంఘటనపై విచారణ చేపట్టాలని డీఈవో ప్రవీణ్ కుమార్ ఎంఈవో నాగ్యానాయక్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఆయన పాఠశాలలో విచారణ చేపట్టి, ఇన్‌చార్జి ఎస్‌వో ప్రశాంతికి మెమో జారీ చేశారు.

అరెస్టు అప్రజాస్వామికం

▸ మక్తల్ మాజీ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డిని స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు

మద్దూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తనను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మక్తల్ మాజీ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా మాగనూర్ మండలంలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టకుండా మక్తల్ మాజీ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డిని పోలీసులు బుధవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి మద్దూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. పది రోజుల్లో మూడు సార్లు మధ్యాహ్న భోజనం వికటించడంపై తాను ఆందోళన వ్యక్తం చేశానని తెలిపారు. అంతమాత్రాన తనను అరెస్ట్ చేయడం ఏమి న్యాయమన్నారు. తాను పార్టీ సమావేశానికి హాజరు కావలసి ఉన్నందున తనను విడిచి పెట్టాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. దీంతో రెండు గంటల అనంతరం ఆయనను వదిలి పెట్టారు. విషయం తెలుసుకున్న మద్దూర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎండీ సలీం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణతో పాటు మద్దూర్, కోస్గీ మండలాల బీఆర్ఎస్ నాయకులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఆరా తీశారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

▸ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్



చేనేత కార్మికురాలితో మాట్లాడుతున్న వనం శాంతికుమార్

రాజోలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వచ్చేనెల 10న నిర్వహించనున్న చేనేత పడుగు పేకల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్ పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలిలో పర్యటించారు. అనంతరం చేనేత కార్మికులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు సంబంధించిన పలు సంక్షేమ పథకాలను ఎత్తివేసిందని ఆరోపించారు. గతంలో రెండు వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించేవారని, ఇప్పుడు రూ. 200 కోట్లు మాత్రమే కేటాయిస్తున్నారని తెలిపారు. చేనేత కార్మికుల అభివృద్ధి కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. చేనేత వస్త్ర పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, దీంతో చేనేత కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చేనేత పడుగు పేకల ఆత్మీయ సదస్సుకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి నరహరి, రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్, రాజోలి చేనేత సహకార సంఘం ఇన్‌చార్జి అధ్యక్షుడు దోత్రె శ్రీనివాసులు, మాబు, ఏఐడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వంక మహేష్, కార్మికులు సోమశేఖర్, వీరేశ్, గోవిందు, రాము పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● తహసీల్దార్ ప్రభాకర్

వడ్డేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయానికి వచ్చే ప్రతీ ఒక్కరి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తహసీల్దార్ ప్రభాకర్ అన్నారు. మండలంలో పరిష్కారం కాని సమస్యలను కలెక్టర్ కార్యాలయానికి పంపుతాము. బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలిపారు.

కొత్తరేషన్ కార్డుల జారీ విషయమై ఆదేశాలు వచ్చాయా?

ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. కానీ ప్రజలు మీ సేవలో దరఖాస్తులు చేసుకుంటున్నారు.

మండలంలో సర్వేయర్ల సమస్య ఉందని తెలుస్తున్నది. ఎందుకు?

సర్వేయర్ రెండు మండలాలకు ఇన్‌చార్జిగా ఉండటం వల్ల కొద్దిగా సమస్య ఉన్న మాట వాస్తవమే. సర్వే గురించి దరఖాస్తు చేసుకున్నటువంటి వారికి ఎలాంటి సమస్య రావడం లేదు. సర్వే చేయిస్తున్నాము.

పట్టాదారు పాస్ పుస్తకాలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి?

పట్టాదారు పాస్ పుస్తకాల జారీలో ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. రిజిస్టర్ చేయించుకున్నటువంటి వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఆలస్యంగా వస్తున్న మాట వాస్తవమే.

అక్రమ రవాణాను ఎలా అడ్డుకుంటున్నారు?

మండలంలో రేషన్ బియ్యం, ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే అటువంటి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాము. తగు చర్యలు తీసుకుంటున్నాము.

ఆరు బయటికే ఆసక్తి

● గ్రామాల్లో మరుగుదొడ్లను వినియోగించని జనం

కేటీదొడ్డి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బహి రంగ మలమూత్ర విసర్జనను గ్రామీణులు వదులుకోలేకపోతున్నారు. అన్నిగ్రామాల్లో ప్రతీ ఇంటికి మరుగుదొడ్డిని నిర్మించుకున్నారు. కానీ బహిరంగ మలమూత్ర విసర్జనపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో మరుగుదొడ్లు ఉన్నా వినియోగించుకోని పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో జనం చాలా వరకు ఆరు బయటికే వెళ్తున్నారు. దీనివల్ల దుర్వాసన, ఈగలు, దోమల బెడద పెరుగుతున్నది. ఆయా గ్రామాల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతు న్నాయి. మరుగుదొడ్లు నిర్మించుకుని కూడా ఆరుబయటకు వెళ్తున్న వారిపై పంచాయతీ అధికారులు ఎలాంటి జరిమానాలు విధించక పోవడం, తగిన చర్యలు తీసుకోకపోవడమే ఈ దుస్థితికి కారణమని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో అధికారులు వందశాతం మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టినా, ప్రజలు వాటిని వినియోగించుకోకపోవటం వల్ల ఆ పథకం లక్ష్యం నీరుగారిపోతుందని పలుగ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ముందుగా ప్రతి కుటుంబం మరుగుదొడ్డిని వినియోగించడం బాధ్యతగా తీసుకోవాలని, ప్రతి ఇంటి నుంచి వచ్చే మురుగునీరు ఆరు బయట వదలకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి అందులోకి మళ్లించే విధంగా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.



కేటీదొడ్డిలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

అధికారులు చర్యలు తీసుకోవాలి



బహిరంగ మలమూత్ర విసర్జనకు వెళ్లేవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. జరిమానా విధించి, ప్రభుత్వ పథకాలను నిలిపివేయాలి. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలి. ప్రజలు ఆరు బయటికి వెళ్లడం వల్ల గ్రామాల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

- శ్రీకాంత్, కేటీదొడ్డి

కుష్ఠువ్యాధి నివారణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

● డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

గద్వాలన్యూటౌన్,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠువ్యాధి నివారణకు వైద్యసిబ్బందికి అందరూ సహకరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యసిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి నివారణలో భాగంగా ఆశ నోడల్ పర్సన్స్, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించి కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. ప్రతి రోజు 20ఇండ్లకు మించకుండా సర్వే చేసి కుటుంబంలో అందరినీ పరీక్షించాలన్నారు. ఇంటింటి సర్వేలో వైద్యసిబ్బంది ముదురు రాగిరంగు మచ్చలు, స్పర్శలేని, మొద్దుబారిన మచ్చలు ఉన్నవారిని గుర్తించి దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేయాలన్నారు.

కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు, ఏఎస్‌వో తిరుమల్‌రెడ్డి, హెచ్.ఏ. నర్సయ్య, వైద్యాధికారులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

● ఎంపీడీవో రామకృష్ణ

వడ్డేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. బుధవారం వడ్డేపల్లి మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బాలల హక్కుల పరిరక్షణ- యువజన సంగాల పాత్ర'పై మండల స్థాయి యువజన సంఘాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నరసింహ మాట్లాడుతూ యువజన సంఘాలకు బాలల హక్కులు, బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మహేష్, ఎంవీ ఫౌం డేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, తిరుమ లేష్, వెంకటేష్, నరేంద్ర, మనోహర్ ఉన్నారు.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల పాత్ర కీలకం

● రాష్ట్ర పరిశీలకులు ఎల్లయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు ఎల్లయ్య

గద్వాల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ సర్వేక్షణ్‌లో భాగంగా డిసెంబరు 4న చేపట్టే కార్యక్రమంలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల పాత్ర అత్యంత కీలకమైనదని ఎస్‌ఆర్‌జీ ఎసీఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకులు ఎల్లయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్‌ఆర్ విద్యానికేతన్‌లో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల అవగాహన కార్యక్రమంలో మండల విద్యాధికారులు శ్రీనివాస్‌గౌడ్, సురేష్ మాట్లాడుతూ పీఏఆర్ఎస్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్ష నిర్వహించాల్సిన విధానాన్ని మాస్టర్ ట్రైనర్లు విష్ణువర్ధన్, నరేష్ వివరించారు. జిల్లా విద్య సమన్వయ అధికారి ఎస్తేరు రాణి మాట్లాడుతూ జిల్లాలోని ఎంపిక చేసిన 74 పాఠశాలల్లో జరగబోయే రాష్ట్రీయ సర్వేక్షణ్‌లో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు శిక్షణలో బోధించిన విధంగా ఓఎంఆర్‌లు ఇన్‌వాలిడ్ కాకుండా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాము, ఎంఈఓలు, సెంట్రల్ ఇన్‌చార్జి, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థినులు చదువుపై దృష్టి సారించాలి

● ఉన్నతస్థాయికి ఎదిగితేనే సమాజంలో గౌరవం, గుర్తింపు
● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి
● మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ్ ముక్త్



బాల్యవివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా న్యాయాధికారి గంట కవితా దేవి

గద్వాల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉజ్వల భవిష్యత్ కోసం విద్యార్థినీలు చదువుపై దృష్టి సారించి జీవితంలో సుస్థిర స్థానం సాధించాలని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి అన్నారు. రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహ్ ముక్త్ కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంట కవితా దేవి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ లక్ష్యాలను నిర్దేశించుకుని చదవి ఉన్నతంగా ఎదినప్పుడే సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు ఉంటుందన్నారు.

మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిని సుధారాణి మాట్లాడుతూ విద్యార్థినులు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని చెప్పారు. చదువు ప్రాముఖ్యత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలల సంక్షేమ సమితి కమిటీ అధ్యక్షుడు సహదేవుడు మాట్లాడుతూ చిన్నారుల రక్షణ, సంరక్షణ కోసం బాలల సంక్షేమ సమితి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. బాలలకు ఇబ్బందులు తలెత్తితే బాలల సంక్షేమ సమితిని సంప్రదించాలన్నారు. బచ్‌పన్ బచావో ఆందోళన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో బాల్యవివాహాలు 23శాతంగా ఉన్నాయని, 2025 నాటికి వాటిని పది శాతానికి తగ్గించి, 2030 నాటికి పూర్తిగా బాల్య వివాహాలను నిర్మూలించి బాల్య వివాహ రహిత దేశంగా నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా నిర్దేశించుకున్నాయన్నారు.

అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ, సభ్యులు జయభారతి, శైలజ, పాఠశాల ప్రిన్సిపాల్ జహీరుద్దీన్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రసన్న రాణి, రూరల్ డెవలప్‌మెంట్ సిబ్బంది మద్దిలేటి, ధనలక్ష్మి, వడ్డె లత, విజ్జు లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

క్రైస్తవులు, సంస్థలకు ప్రభుత్వ సత్కారం

● జిల్లా మైనారిటీస్ సంక్షేమశాఖ అధికారి ఎం.పి. రమేష్‌బాబు

గద్వాల న్యూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది క్రిస్మస్ పండుగ సంబరాల సందర్భంగా సామాజిక, విద్య, వైద్య, సాహిత్య, క్రీడ, కళారంగాలలో సేవ కనబరిచిన ప్రతిభావంతులైన క్రైస్తవ వ్యక్తులను, సంస్థలను తెలంగాణ ప్రభుత్వం సత్కరిస్తున్నట్లు జిల్లా మైనారిటి సంక్షేమశాఖ అధికారి ఎం.పి. రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ(మైనారిటీస్) ఫైనాన్స్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో 10 సంవత్సరాలకు పైబడి ఉత్తమ సేవ/ప్రతిభ కనబర్చిన వ్యక్తులను, 30 సంవత్సరాలు పైబడి ఉత్తమ సేవ/ ప్రతిభ కనబరిచిన సంస్థల నుంచి నామినేషన్లు స్వీకరిస్తుందన్నారు. కాబట్టి నామినేషన్ ఫారాలు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యా లయంలో పొందాలన్నారు. పూర్తిచేసిన నామినేషన్ ఫారాలు డిసెంబరు 5వ తేదీలోగా జి ల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

పరీక్ష కేంద్రం వద్ద ఇబ్బందిపడిన విద్యార్థినులు

గద్వాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షల సందర్భంగా బుధవారం హాల్‌టికెట్ నెంబర్లు, హాల్ నెంబర్లను అలాట్ చేస్తూ అధికారులు బోర్డులపై ఏర్పాటు చేశారు. కాగా వీటిని చూసుకునేందుకు విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఏ రూంలో ఏ నెంబర్లు ఉన్నాయో చూసుకునేందుకు వందల మంది విద్యార్థినులు ఒకేసారి బోర్డు వద్ద గుమికూడటంతో గందరగోళానికి గురయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాలఅర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 33/11 కేవీ అల్వాలపాడు సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే 11కేవీ కోతులగిద్ద ఫీడర్‌కు ఉన్న పాత కండక్టర్‌ను తీసి కొత్తది ఏర్పాటు చేస్తున్నందున ఈ నెల 28వ తేదీ గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ రమేష్‌బాబు, ధరూరు ఏఈ అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కోతులగిద్ద, అల్వాలపాడు, కొత్తపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

విద్యుదాఘాతంతో కల్లు దుకాణం దగ్ధం



కాలి బూడిదైన కల్లు దుకాణం

గద్వాల క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో ఉన్న కల్లుదుకాణం బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో దగ్ధమైనట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు. తడికెలతో ఏర్పాటు చేయడంతో మొత్తం కాలిపోయింది. దుకాణంలో రూ.5వేల విలువచేసే వైర్లు కాలిపోయాయని, ఎలాంటి ఇతర నష్టం సంభవించలేదని ఫైర్ సిబ్బంది తెలిపారు.

విజయోత్సవాలపై సాంస్కృతిక కార్యక్రమాలు



మానవపాడులో కళాకారుల ఆటాపాట

మానవపాడు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలపై కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో సాంస్కృతిక కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఏడాది పాటు చేసిన అభివృద్ధి పథకాలపై కళాకారులు ఆటా పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వహీదా ఖాతున్, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, కళాకారులు కేశవులు, హజ్రత్, రమాదేవి, భూపతి, కృష్ణ, స్వామి, కవిత ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

● కలెక్టర్ బీఎం సంతోష్
● పాఠశాలలో ఘనంగా ఎన్‌సీసీ డే

గద్వాల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలుగుతూ సామాజిక సేవలో భాగస్వాములై ఉత్తమ పౌరులుగా ఎదగాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. 77వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై కలెక్టర్ ఎన్‌సీసీ జెండాను ఎగరవేశారు. అంతకుముందు ముఖ్యఅతిథులు కలెక్టర్, ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి కాంతమ్మకు ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు, గౌరవ వందనంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక విద్యార్థులు కలిగిన పాఠశాలలో ఈ సంవత్సరం నుంచి ఎన్‌సీసీ యూనిట్లు ప్రారంభించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు సామాజిక సేవలో భాగస్వాములయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్‌సీసీ విద్యార్థుల పాత్ర చాలా గొప్పదన్నారు. అలాగే ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో కూడా ఎన్‌సీసీ యూనిట్లను ప్రారంభించి విద్యార్థులందరూ పాల్గొనేలా చూడాలన్నారు. భవిష్యత్‌లో ఎన్‌సీసీ కోటా కింద ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మరుగుదొడ్లకు లక్ష రూపాయలు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట నరసయ్య, సీటీవో రాముడు, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు, పూర్వపు ఎన్‌సీసీ ఆఫీసర్లు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఈవీఎంలు అత్యంత సురక్షితమైనవి

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఎన్నికల నిర్వహణకు వినియోగించే ఈవీఎంలు అత్యంత సురక్షితమైనవిగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీఎం సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయొచ్చని పేర్కొంటే మళ్లీ బ్యాలెట్ పేపర్లకు అమల్లోకి తేవాలని కోరుతూ కొందరు వ్యక్తులు ఇటీవలే సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారని, పిల్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం కేసును కొట్టి వేస్తున్నట్లు తీర్పు వెలువరించారని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, పి.బి. వరాలే ఈ అంశంపై విచారణ జరిపిన అనంతరం పిటిషన్‌ను కొట్టివేస్తూ సంచలన తీర్పును వెలువరించారని పేర్కొన్నారు. నాయకులు ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు కరెక్ట్ అని చెప్పడం, ఓటమి పాలైనప్పుడు మాత్రం ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తపరచడం సరికాదని తెలిపారు. ఈ తీర్పు ఈవీఎంల విశ్వసనీయతకు మద్దతుగా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందనడానికి రుజువుగా నిలుస్తుందని తెలిపారు. ఓటర్లు ఎన్నికల ప్రక్రియ, భారత ఎన్నికల సంఘంపై నమ్మకం కలిగి ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

విద్యార్థిని మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలి

● బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

వడ్డేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు వసతి గృహాల్లో కలుషిత ఆహారం తిని మృతి చెందిన విద్యార్థిని మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య అన్నారు. ఫుడ్ పాయిజన్ వల్ల వరుసగా విద్యార్థులు అనారోగ్యం బారిన పడటం దురదృష్టకరమన్నారు. బుధవారం మునిసిపాలిటీ కేంద్రం శాంతినగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పల్లయ్య మాట్లాడారు. ఇటీవల ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థిని శైలజ మృతి అత్యంత బాధాకరమని, విద్యార్థిని మృతి చెందిన 24గంటల్లోపే, నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో దవాఖానలో చేరారని, దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయని, కనీస వసతులు, సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. పలుచోట్ల కలుషితనీరు తాగడం, పురుగుల అన్నం, పాడైన కూరగాయలతో వంట చేయడంతో విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. రాష్ట్రంలోని పలు వసతిగృహాల దుస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించక పోవడం విచారకరమన్నారు. తక్షణమే విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు, నియోజకవర్గ నాయకులు ఖాజావలి, రాజు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ ఐజీ సుమతి తండ్రికి చల్లా నివాళి



సుమతి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్ చౌరస్తా, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐజీ సుమతి తండ్రి ఇటీవల వయోభారంతో మరణించిన సంగతి తెలిసిందే. ఆయన స్వగ్రామం ఉండవల్లి మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో బుధవారం పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ చల్లాతో పాటు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, పోలీసులు ఉన్నతాధికారులు ఐజీలు రమేష్‌రెడ్డి, సత్యనారాయణ, గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక పోలీసు అధికారులు, ప్రముఖ నాయకులు హాజరై నివాళులు అర్పించారు.

యోగాతో మెదడుకు చురుకుదనం

- రాష్ట్ర యోగా అవార్డు గ్రహీత అందె జీవన్‌రావు

అలంపూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వలన ఆరోగ్యకరంగా ఉండటమే గాక మెదడుకు చురుకుదనం వస్తుందని రాష్ట్ర యోగా అవార్డు గ్రహీత అందె జీవన్‌రావు అన్నారు. అలంపూర్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఆయన విద్యార్థులకు సూపర్ బ్రెయిన్ యోగాపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. యోగా చేయడం వలన మెదడు చురుగ్గా పని చేయడమే గాక జ్ఞాపకశక్తి పెరుగుతుందని తాజా పరిశోధనలు చెబుతున్నాయని అన్నారు.

అలాగే ఏకాగ్రత, అభ్యసనం, శ్రద్ధ, సృజనాత్మకత, ఆసక్తి, మానసికస్థితి మెరు గుపడటం, రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో యోగా చేయించి అవగాహన కల్పించారు.

కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న కస్తూర్బా విద్యార్థినులు

మానవపాడు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలకు బాల్య వివాహాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి అవగాహన కల్పించారు. బుధవారం మానవపాడు మండల కస్తూర్బా పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులచే గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని బాలికలకు వివాహం చేయరాదని, ఇది నేరమని చెప్పారు. కిశోర బాలికలకు ఏమైనా సమస్యలు, ఇబ్బందులు తలెత్తితే 100, 1098కు కాల్ చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అనురాధ, అంగన్‌వాడీలు సుమిత్ర, చెన్నమ్మ, జయమ్మ, విమల, కృష్ణవేణి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నూతన వంతెన నిర్మించాలి



మునిసిపాలిటీ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అయిజ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అయిజ పట్టణంలోని వాల్మీకి ఆలయం ఏరియాలో నూతన వంతెన నిర్మించాలని బీజేపీ నాయకులు మునిసిపాలిటీ అధికారులను కోరారు. పెద్దవాగు బ్రిడ్జీ నుంచి వచ్చే రహదారి వెడల్పుగా ఉండి ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండేందుకు ఇక్కడ ఒక మినీవంతెన నిర్మించాలని మునిసిపాలిటీ ఏఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఈ మార్గంలో ప్రతిరోజు గద్వాల, హైదరాబాద్, కర్నూలు, రాయచూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం వాహనాలు వెళ్తుంటాయని తెలిపారు. కావున గుడిని ఆనుకుని పెద్దవాగు బ్రిడ్జి మీదుగా పాదచారులు వెళ్లేందుకు మరో రోడ్డు ఏర్పాటు చేస్తే ఇక్కడ ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గే అవకాశం ఉందని, వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భగత్ రెడ్డి, లక్ష్మనాచారి, నాగరాజు, భీమన్న, చిన్న అంజనేయులు, రాముడు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు తరలిరావాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్

గద్వాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) కేసీఆర్ ఆమరణ దీక్ష చేపటిన రోజున ఏటా నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదులు, ప్రజలు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్రనాయకుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం గద్వాల భవన్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కాడెద్దు మృతి

- పుటాన్‌దొడ్డి వద్ద ఘటన

ఎర్రవల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) ఎర్రవల్లి మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామ స్టేజి సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం ఎదురుగా వెళ్తున్న కాడెద్దుల బండిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే కాడెద్దు మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ రాజేష్ తన ఎద్దుల బండిపై భార్యతో కలిసి తన పొలానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొట్టింది. దీంతో ఒక ఎద్దు మరణించగా మరో ఎద్దు తీవ్రంగా గాయపడిందని కొదండాపురం ఎస్ఐ స్వాతి తెలిపారు.